క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



శ్రీ ప్రభుపాదకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఇస్కాన్ మందిరాల వ్యవస్థాపకుడు శ్రీ ప్రభుపాదుల వారి అంతర్ధాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీప్రభుపాదుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువంశరామ్, అశోక్ ఆధ్వర్యంలో స్వామి వారి విగ్రహానికి పంచామృత అభిషేకాలు, పుష్పాభిషేకం, పుష్పాంజలి అనంతరం శ్రీ కృష్ణ భగవానుని లీలలు, భగవద్గీత శ్లోకాలు, భజన సంకీర్తనలు జరిపించారు.

రేపు ప్రవక్త ప్రవచనాల ఆలాపన

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 19వ తేదీ సాయంత్రం పట్టణంలోని అంటికోట మసీదులో మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను తెలుగు, ఉర్దూలో వినిపిస్తున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సమద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవచనాలను సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ మహ్మమద్ రఫి తెలుగులో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మమద్ కరీముద్దీన్ ఉర్దూలో వినిపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎస్ఎండీ ఫరూఖ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఏపీ ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్, రామచంద్రరావు, నూర్ అహ్మద్ మదాని పాల్గొంటారన్నారు.

24న ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ కాలనీ, త్యాగరాజ నగర్‌లో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజ స్వామి దేవస్థానంలో ఈ నెల 24వ తేదీన శ్రీ శివ పార్వతుల, పంచముఖి ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు తెలిపారు. సంఘ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన ఆలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. నంద్యాల జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, దీక్షా హోమం, 25న జపాదులు, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు కార్తీక వనభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ చూపిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని వివరించారు. వివరాలకు సెల్ 7013846031 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి

ఉయ్యాలవాడ : టీబీ రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారిణి అపర్ణ పేర్కొన్నారు. స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాల పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ధ్రువపత్రాల అందజేత

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 5 నెలలుగా స్కిల్‌హబ్‌లో నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ధ్రువ పత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ పార్వతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ శిక్షణలో డేటా ఎంట్రీ, ఆపరేటర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఐటీ సేల్స్, టెలీకాలర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

ఉయ్యాలవాడ : అవధూత వెంకట సుబ్బారెడ్డి స్వామి 20వ ఆరాధనోత్సవాలు మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆశ్రమం నిర్వాహకులు మహానందరెడ్డి ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి నాయన చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై అమర్చి గ్రామోత్సవం చేపట్టారు.

26న వనభోజనాలు

నంద్యాల(అర్బన్): ఈ నెల 26వ తేదీన ప్రథమ నందీశ్వర ఆలయ ఆవరణలో అఖిల భారత రజక సేవాసంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు రామ మద్దిలేటి, అధ్యక్షుడు జిల్లెల్లశ్రీరాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులు, కులపెద్దలు హాజరు కావాలని కోరారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ల నియామకం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిలాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కన్వీనర్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి శుక్రవారం నియమించారు. నంద్యాల అసెంబ్లీ కన్వీనర్‌గా అభిరుచి మధు, ఆళ్లగడ్డ కన్వీనర్‌గా భూమా కిషోర్ రెడ్డి, బనగానపల్లె కన్వీనర్‌గా డీవీ సుబ్బారెడ్డి, డోన్ కన్వీనర్‌గా రమణ, నందికొట్కూరు కన్వీనర్‌గా ఏ.నాగేశ్వరరావు, పాణ్యం కన్వీనర్‌గా బి.నవీన్ రెడ్డిని నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఇంటింటికీ కుళాయి

- శిరివెళ్ల మండలానికి రూ.16.55 కోట్లు మంజూరు
- 20 అదనపు వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటు
- ఐదు గ్రామాల్లో ఇప్పటికే పనులు ప్రారంభం
- త్వరలో అన్ని గ్రామాల్లో చేపట్టేందుకు చర్యలు



కోటపాడులో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

శిరివెళ్ల: గ్రామాల్లో తాగునీటి కష్టాలకు త్వరలో పరిష్కారం లభించనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు కావడంతో మొదటగా కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిలో చేపట్టాల్సి ఉంది. కాగా ఆయా పనులకు గతేడాది పల్లెల్లో అధికారులు సర్వే చేపట్టారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాల్లో కుళాయిల ఏర్పాటుకు గతేడాది సమగ్ర సర్వే చేపట్టారు. ఏఏ గ్రామాల్లో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ఎన్ని వాటర్ ట్యాంక్‌లున్నాయి. పైప్‌లైన్లు ఎంత మేర ఉన్నాయి, ఇంకా అదనంగా ఎన్ని వాటర్ ట్యాంక్‌లు అవసరం, పైప్‌లైన్ ఎంత మేర వేయాలని సర్వేలో తేల్చారు. ఆ సర్వే ప్రకారం ఇళ్ల సంఖ్య ఆధారంగా మండలంలో 20 అదనపు ట్యాంక్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం మండలానికి రూ.16.55 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో వాటర్ ట్యాంక్‌లు, మోటార్లు, పైప్‌లైన్లు, విద్యుత్ పనులు చేయాల్సి ఉంటుంది. పథకం కింద మండలంలో మొదటగా కోటపాడు, వీరారెడ్డిపల్లె, గోవిందపల్లె, వెంకటేశ్వరపురం గ్రామాలకు మంజూరైన నిధులకు పనుల అమలుకు టెండర్లు పూర్తయ్యాయి. కోటపాడులో అదనపు ట్యాంక్ పనులు మొదలయ్యాయి.

అదపును ట్యాంక్‌ల నిర్మాణ గ్రామాలు..

ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయడంలో భాగంగా గ్రామాల్లో ఇప్పటికే ఉన్న ట్యాంక్‌లతో పాటు అదనపు ట్యాంక్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తాగునీటిని సక్రమంగా ప్రతి ఇంటికి అందేలా చర్యలు తీసుకుంది. ఇళ్ల సంఖ్య ఆధారంగా అదనపు ట్యాంక్‌లు నిర్మాణాలు జరగనున్నాయి. అదనపు ట్యాంక్‌ల నిర్మాణాలు చేపట్టనున్న గ్రామాలు.. మండల కేంద్రంలో ఇప్పటికే 4 మేజర్ ట్యాంక్‌లున్నాయి. వాటికి అదనంగా 90 వేల లీటర్ల సామర్థ్యం గల 2 అదనపు ట్యాంక్‌లు, 60 వేల లీటర్ల సామర్థ్యం గల మరో 2 ట్యాంక్‌లు ఏర్పాటు చేయనున్నారు. గోవిందపల్లెలో లక్షా 20 వేల లీటర్ల సామర్థ్యం గల ఒక ట్యాంక్, యర్రగుంట్లలో లక్షా 20 వేలది ఒకటి, 40 వేల లీటర్లవి రెండు, బోయలకుంట్లలో 40 వేలవి ఒకటి, చెన్నూరులో 20 వేలది ఒకటి, గంగవరంలో 40 వేలది ఒకటి, గుంప్రమాన్‌దిన్నెలో 90 వేలది ఒకటి, గాంధీనగరంలో 20 వేలది ఒకటి, గుండంపాడులో 40 వేలది ఒకటి, మహదేవపురంలో 40 వేలది ఒకటి, కామినేనిపల్లెలో 20వేలది ఒకటి, పచ్చర్లో 20 వేల లీటర్ల సామర్థ్యం గల ఒకటి అదనపు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నారు.

గ్రామాల వారిగా నిధుల వివరాలు..

పంచాయతీ	ఇళ్లు	నిధులు (రూ.ల్లో)
శిరివెళ్ల	23,230	6.13 కోట్లు
యర్రగుంట్ల	1,567	2.81 కోట్లు
గోవిందపల్లె	1,815	1.24 కోట్లు
గుంప్రమాన్‌దిన్నె	779	75 లక్షలు
జీనేపల్లె	365	34.06 లక్షలు
కోటపాడు	845	1.09 కోట్లు
కామినేనిపల్లె	366	34.06లక్షలు
చెన్నూరు	897	63 లక్షలు
బోయలకుంట్ల	718	45.07లక్షలు
గంగవరం	467	19.07లక్షలు
గుండంపాడు	487	42.01లక్షలు
మహదేవపురం	765	71.9 లక్షలు
వీరారెడ్డిపల్లె	398	51.48 లక్షలు
వెంకటాపురం	367	45.01లక్షలు
వనికినిదిన్నె	363	30.06లక్షలు

కోటపాడులో పనులు మొదలయ్యాయి



మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు ప్రభుత్వం రూ.16.55 కోట్లు మంజూరు చేసింది. 5 గ్రామాల్లో పనులకు టెండర్లు పూర్తయ్యాయి. కోటపాడులో అదనపు ట్యాంక్ పనులు మొదలయ్యాయి. గోవిందపల్లె, వీరారెడ్డిపల్లె, వెంకటేశ్వరపురం, కొట్టాలపల్లెలో పనులు ప్రారంభం కానున్నాయి. 2024కు ఇంటింటికీ నీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

– కిరణ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ

ఆయిల్‌పామ్ సాగుపై నేడు సదస్సు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జిల్లా ఉద్యానశాఖాధికారి యూ.నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు, యాజమాన్య పద్ధతులపై అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ శాస్త్రవేత్త రామచంద్రుడు హాజరౌతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేందుకు 4 ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని పేర్కొన్నారు.

అన్నదానం అభినందనీయం

నంద్యాల(వ్యవసాయం): ప్రథమ నంది దేవాలయంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానం సేవలు అభినందనీయమని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సిద్ధం శివరాం, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రథమ నందీశ్వరుడు, కేదారేశ్వరీమాతకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులకు అన్నదానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కమిటీ సభ్యులు రామశివారెడ్డి, చలంబాబు, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, శైలేంద్రనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాంశ్‌రెడ్డి, సుధాకర్, విజయేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకు..



మల్లెవేములలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ముగిసింది. చివరి రోజు మల్లెమేముల సచివాలయ పరిధిలోని నగళ్లపాడు, రాజోలి గ్రామాల్లో సర్పంచ్ సరోజమ్మ, స్థానిక నాయకులు మల్లారెడ్డి, స్వామిరెడ్డి, జ్యోతీశ్వరరెడ్డిలతో ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం వద్ద సమీక్ష సమావేశం నిర్వహించి, అవసరమైన పనుల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఏఈ కొండారెడ్డిని ఆదేశించారు. అలాగే గ్రామంలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయని, అదనపు స్తంభాలు ఏర్పాటు చేయాలని ఏఈ షాజహాన్‌కు సూచించారు. సచివాలయ అభివృద్ధికి రూ.20.00 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, సర్పంచ్‌లు బంగారు షరీఫ్, ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు వెంకటసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.రామగుర్విరెడ్డి, నాయకులు జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విక్షిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సంజయ్ కుమార్

నంద్యాల: ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ వరకు 60 రోజుల పాటు నిర్వహించే విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర ను విజయవంతం చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంకింగ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో యాత్ర నిర్వహణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పాల్గొన్నారు. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాల ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 4 వాహనాల ద్వారా రోజుకు రెండు గ్రామాలు చొప్పున 489 గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందుకోసం 37 మంది జిల్లా అధికారులను కేటాయించి బాధ్యతలు అప్పగించామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లో ప్రమాద నివారణ చర్యలు చేపట్టండి

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రమాదకర రసాయన ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీలలో తీసుకోవలసిన భద్రత ప్రమాణాలు, వ్యక్తిగత భద్రత పరికరాలు, భద్రత కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఫ్యాక్టరీని అత్యధిక తీవ్ర ప్రమాదకారక ఫ్యాక్టరీగా గుర్తించామన్నారు. ఫ్యాక్టరీల చట్టం కింద ఉన్న ఫ్యాక్టరీల వివరాలు, డిస్ట్రిక్ క్రైసిస్ గ్రూప్ విధుల గురించి విశదీకరించారు.

వేగంగా చెరువుకట్ట అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణంలోని చెరువు కట్ట పనులను వేగంగా చేయడమే కాకుండా నాణ్యత లోపించకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన చెరువు కట్టపై టూరిజం శాఖ, గ్రీన్‌కో సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు చెరువు కట్టను తీర్చిదిద్దుతున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పోస్టర్ ఫ్రీ పట్టణంగా తీర్చిదిద్దుదాం

నంద్యాలను పోస్టర్ ఫ్రీ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్తులు, ఫ్లైఓవర్లు, డివైడర్లు, ఎలక్ట్రిక్ స్తంభాలపైన కరపత్రాలు, వాల్ పోస్టర్ల లాంటివి అనుమతి లేకుండా అతికిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు పర్యావరణ పరిరక్షణకు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో భాగంగా గతంలోనే పోస్టర్ ఫ్రీ టౌన్‌గా ప్రకటించామని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి రూ.2వేల నుంచి రూ.50వేల వరకు జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

జోరుగా వ్యవసాయ పనులు



ఉయ్యాలవాడ సమీపంలో పప్పు శనగ పంటలో కలుపు తీస్తున్న కూలీలు

ఉయ్యాలవాడ : రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ, మినుము పంటలో అంతర కృషి పనులు జోరుగా సాగుతున్నాయి. కలుపు పెరిగిపోవడంతో తొలగింపు పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. మండలంలో ఈ ఏడాది ఇప్పటి వరకు తెల్లశనగ కాబూలీ రకం అధికంగా..8 వేల హెక్టార్లలో సాగు చేశారు. 2 వేల హెక్టార్లలో ఎర్రశనగ సాగైంది. మినుము, మిరప, సోయాబీన్ తదితర పంటలు 800 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం కలుపు తొలగింపు, నివారణ పనులు జోరందుకోవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. రోజువారీగా రూ.350 నుంచి రూ.450 వరకు కూలి చెల్లించాల్సి వస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు. వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే రైతుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రాజెక్ట్‌కు ఎంపిక



ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న విద్యార్థిని

గోస్పాడు: రాష్ట్రస్థాయి సైన్స్ ప్రాజెక్టుకు గోస్పాడు హైస్కూల్ విద్యార్థిని కావేరి ఎంపికైందని హెచ్ఎం నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆహారం ఏ కారణాలతో చెడిపోతుంది..వాటిని నిరోధించే సాధనాలను ఎలా ఉపయోగించాలో గత నెల 30న నంద్యాలలో సోషల్ అండ్ కల్చరల్ ప్రాక్టీసెస్ ఫర్ ఎకో సిస్టం అండ్ హెల్త్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. దీంతో ఈనెల 29 30 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి ప్రాజెక్టుకు ఎంపికై oదని చెప్పారు. అనంతరం విద్యార్థినిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులోని నందమూరి నగర్, వైఎస్ నగర్, ఆటోనగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీ–3 ఏఈ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ తీగల పరిశీలనలో భాగంగా సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుస్తకం ఓ మంచి నేస్తం

రుద్రవరం: పుస్తకం ఓ మంచి నేస్తమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక తువ్వపల్లె తిప్పమీదున్న పాఠశాలలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పుస్తక పఠనం వాటి వల్ల కలిగే లాభాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మేధావులు, కవులు,గ్రంథాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

ఆళ్లగడ్డ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 31 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు అందజేశారన్నారు.

ఎలుకల మందు పంపిణీ

గోస్పాడు: రైతులకు ఉచితంగా ఎలుకల మందును పంపిణీ చేసినట్లు ఏఈఓ బాల నరసింహులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఒంటి వెలగల గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన బ్రోమోడయోలోన్ ఎలుకల మందును అందజేశారు. ఆయన మాట్లాడుతూ వరి పొలాల్లో ఎలుకల వల్ల పైరుకు నష్టం కలుగుతుందన్నారు. దీంతో సామూహిక ఎలుకల నిర్మూలన కోసం రైతులకు ప్రభుత్వం ఉచితంగా మందును మంజూరు చేసినదని చెప్పారు.

రేపు జిల్లాకు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆదివారం నంద్యాల జిల్లాలోని గిరిజన గ్రామాల్లో పర్యటించనున్నారని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు వారి పర్యటనకు సంబంధించిన వివరాలను స్థానిక కార్యాలయంలో వెల్లడించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డులో కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, వార్డు ఇన్‌చార్జ్ ఎద్దు రవితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. పేదల పక్షాన నిలిచిన ప్రభుత్వానికి మద్దతిచ్చి వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. కౌన్సిలర్ కలాంబాషా, సచివాలయ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, నాయకులు దేవనగర్ బాషా, భాస్కర్‌రెడ్డి, అమృతరాజ్, రామచంద్రుడు, కారు రవికుమార్, ఎద్దుల ప్రవీణ్, ప్రసన్న, జీవన్, సంజీవ, పాల్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

వేలంలో ఆలయానికి ఆదాయం

శిరివెళ్ల: శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయానికి వివిధ వేలాల ద్వారా ఆదాయం సమకూరింది. ఆలయంలోని వివిధ దుకాణాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. టెంకాయిలు, బొమ్మల అంగళ్లు, తినుబండారాలు, స్వామి వారి పటాలు విక్రయించే దుకాణాలకు వేలం వేయగా.. రూ. 4.75 లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది వేలం పాటలలో రూ.3.76 లక్షలు పలికింది. దీంతో ఈ ఏడాది ఆలయానికి రూ.99 వేలు అదనపు ఆదాయం సమకూరింది. కాగా తలనీలాల సేకరణ వేలానికి సరైన ధర లభించకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. వేలాలను ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షించారు. ఈఓ నరసయ్య, చైర్మన్ రేవనూరు ఆంజనేయరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆళ్లగడ్డ: పేరాయిపల్లె మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వార్డు సచివాలయ ఉద్యోగిని ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని 8వ వార్డు సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆదిలక్ష్మి శుక్రవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ ముగించుకుని తిరిగి భర్త నరసింహారెడ్డితో కలిసి ఆళ్లగడ్డకు బయలుదేరారు. ఈ క్రమంలో పేరాయిపల్లె మెట్ట సమీపంలో బైకు అదుపుతప్పింది. బైకుపై నుంచి కిందపడ్డ ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడటంతో స్థానిక వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు.

కర్నూలు– విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలోని రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని, కర్నూలు–నంద్యాల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని, కర్నూలు–విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని కోరుతూ శుక్రవారం పాణ్యం మండల కేంద్రానికి వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ జైన్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, బాల వెంకట్ మాట్లాడుతూ నంద్యాల నుంచి హైదరాబాద్‌కు మరో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని, ముంబయికి నంద్యాల మీదుగా రైలు వేయాలని, కర్నూలు నుంచి విజయవాడకు రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని కోరారు. అలాగే శ్రీశైలానికి రైల్వే లైను నిర్మించాలని, నూనెపల్లె రైల్వే గేటు దగ్గర అండర్ పాస్ బ్రిడ్జిని వెడల్పుగా నిర్మించాలని, మూలసాగరం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం నాయకులు భాస్కర్, ప్రతాప్, సతీష్, రాజు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

నంద్యాల(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక సహకార సంఘాలకు అధిక నిధులు కేటాయిస్తూ వాటి పురోభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాయని జిల్లా సహకార శాఖాధికారి యం.వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం పోలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని పాండురంగాపురంలో సంఘం అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. డీసీఓ మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేసే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాలకవర్గ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నంద్యాల డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ నాగమణి, ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ సౌమ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి, యూనియన్ ప్రతినిధి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జీవం పోసుకున్న ఆశలు



దొర్నిపాడు వద్ద నీటి తడులు ఇవ్వడంతో పచ్చదనం పులుముకున్న జొన్న, కంది పంటలు



చాకరాజువేముల-దబ్బ్లు గోవిందిన్నె గ్రామాల మధ్య పారుతున్న చివరి ఆయకట్టు కాలువ

- కేసీకి సాగునీరు విడుదలతో రైతుల హర్షం
- చివరి ఆయకట్టుకు చేరిన నీరు
- పంటలు చేతికి వచ్చినట్లే అంటున్న అన్నదాతలు

దొర్నిపాడు: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అధికారులు కేసీ కెనాల్ కింద ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. ఇంతలోనే రబీ పంటల సాగుకు ముందు వర్షాలు విడువకుండా పదిరోజుల పాటు విస్తారంగా కురిశాయి. దీంతో రైతులు వర్షాలు కురుస్తున్నాయి కదా అని పత్తి, మిరప, జొన్న, కంది, మినుము, వరి తదితర పంటలను సాగుచేశారు. దీంతో పంటలు పెరిగే సమయానికి వరుణుడు ముఖం చాటేశాడు. అప్పటికే రైతులు రూ.వేలల్లో పెట్టుబడులు వెచ్చించారు. ఓ వైపు పంటలు ఎండుతుండటాన్ని గమనించిన ప్రభుత్వం కేసీ కెనాల్ ద్వారా వారాబందీ పద్ధతిలో నీటిని విడుదల చేసింది. దీంతో పంటలకు జీవం పోసినట్లయ్యిందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

ఆశాజనకంగా పంటలు..

ప్రస్తుతం కేసీ కెనాల్‌కు సాగునీరు వారం రోజులుగా వస్తుండటంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుంది. ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రైతుల అగచాట్లను గుర్తించి జిల్లా కలెక్టర్‌తో చర్చించి మరో రెండు రోజులు నీటి విడుదలను కొనసాగించేటట్లు చర్యలు తీసుకోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుంది.

మండలంలో సాగైన పంటల వివరాలు..

పంట	సాగు హెక్టార్లలో
వరి	361
జొన్న	46
మొక్కజొన్న	13
కొర్ర	14
కంది	182
మినుము	1,192
పెసలు	30
వేరుశనగ	64
సోయాబిన్	45
మిరప	643
పత్తి	723
ఇతర పంటలు	14
మొత్తం	3,327

చివరి పంటలకు నీరందుతుంది



ప్రస్తుతం కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ప్రభుత్వం రైతులను ఆదుకుంది. వర్షాభావ పరిస్థితుల్లో జలాశయాల్లో అంతంత మాత్రంగానే నీరున్నప్పటికీ పంటలు ఎండపోరాదని, రైతన్నలు నష్టపోరాదని వారాబందీ పద్ధతిలో విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు అందుతోంది. రైతులు అధికారుల సూచనలు పాటించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చివరి వరకు నీరందుతుంది. పంటలను రక్షించడం అభినందనీయం.

–వాసుడు, రైతు, చాకరాజువేముల

పంటలన్నింటికీ సాగునీరందాలి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసీ కాలువ వెంట పర్యటించి రైతులకు సాగునీటి వినియోగంపై అవగాహన కల్పించాం. మోటార్లను ఉపయోగిస్తే చివరి ఆయకట్టు కు సాగునీరు అందడం కష్టమని తెలుసుకొని కాల్వల ద్వారానే వచ్చే నీటిని పంటలకు మళ్లించుకోవాలని రైతులకు సూచించారు. వారు కూడా సహకరించడంతో చివరి ఆయకట్టుకు కూడా నీరందుతోంది. సాగైన పంటలన్నింటికీ నీరందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

–జయప్రసాద్, తహసీల్దార్, దొర్నిపాడు